


టీటీడీ ఆధ్వర్యంలో రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో శనివారం జరగనున్న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ కల్యాణానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నందున ఏర్పాట్లను బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు.

వేంకటేశ్వరుని కల్యాణం చూతము రారండి...



వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో వేస్తున్న భారీ గుడి సెట్టింగ్స్

8

మామూళ్ల... కిక్



మత్తులో పల్లెలు..

బాపట్ల జిల్లాలో 700, ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేలకు పైగా బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తుంది. పల్నాడు జిల్లా పరిధిలోని ఓ ప్రజా ప్రతినిధి గ్రామంలో ఆరు మద్యం బెల్ట్ షాపులు ఉన్నాయి. అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే మంచినీటి సరఫరా లేని ప్రాంతాల్లో కూడా మద్యం అందుబాటులో ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

రోడ్లపైనే మద్యపానం.. ఎక్కడంటే అక్కడ బెల్ట్ దుకాణాలు.. కావాల్సిన మద్యం ఎనిటైం డోర్ డెలవరీ.. యథేచ్ఛగా ఎమ్మార్పీ ఉల్లంఘనలు.. వేళలు పాటించని దుకాణదారులు.. శృతి మించిపోతోన్న మందు బాబుల ఆగడాలు.. అయినా అటు పోలీసు.. ఇటు ఎక్సైజ్ అధికారులకు పట్టడంలేదు. ప్రజలు మద్యం ఇబ్బందులపై ఫిర్యాదులు చేస్తున్నా ఆయా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. మద్యం దుకాణ దారుల నుంచి వసూలు చేసే మామూళ్లే ఇందుకు కారణమని తెలుస్తోంది. మామూళ్లు దండుకోవడంలో బిజిబిజీగా ఉన్న ఎక్సైజ్, పోలీసు శాఖలు మద్యం అక్రమాలపై దృష్టి సారించడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండని అధికారులు అభయం ఇస్తుండటంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మద్యం వ్యాపారులు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కేస్తున్నారు. ఆయా శాఖలు దుకాణానికి నగదు ఫిక్స్ చేసి మరీ నెలవారీగా వసూలు చేస్తున్నారు. మద్యం వ్యాపారులు మామూళ్లు ఇవ్వడం సర్వసాధారణమైనా ప్రస్తుతం ఆ మొత్తాన్ని అమాంతం పెంచేశారు. దీంతో ఆ భారాన్ని వ్యాపారులు మద్యం విక్రయాలు, ఎమ్మార్పీ పెంచి అమ్ముకోవడంతో సరిపెట్టుకుంటున్నారు. ఈ కారణంగానే మూడు జిల్లాల్లో మద్యం అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తెలుస్తోంది.

- అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండి
- వ్యాపారులను పిండేసేలా అధికారుల దందా
- పల్నాడు జిల్లాలో దుకాణానికి రూ.50 వేలు ఫిక్స్
- బాపట్ల జిల్లాలో రూ.25 వేలుగా నిర్ణయించి వసూలు
- గుంటూరులో రూ.20 వేలు వసూలు చేస్తున్న పోలీసులు
- చెప్పినంత ఇవ్వకుంటే కేసులు.. దాడులని బెదిరింపులు
- మామూళ్ల వసూళ్లలో ఎక్సైజ్, పోలీసు శాఖలు బిజీబిజీ
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం



బరితెగింపు

గ్రామాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే బెల్టుతీస్తాం.. ఎమ్మార్పీ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.. మద్యం విషయంలో నేతల జోక్యాన్ని సహించేది లేదు.. అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరికలు చేసినా క్షేత్రస్థాయిలో ఎక్కడా వాటిని పట్టించుకున్న నాయకులు కానీ, అధికారులు కానీ లేరు. పైగా దాదాపు ప్రతి గ్రామంలో ఒకటికి మించి బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే, లైసెన్సు మద్యం షాపుల యజమానలే నేరుగా మద్యాన్ని గ్రామాల్లో డెలివరీ చేయడం బరితెగింపునకు నిదర్శనంగా కనబడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మద్యం అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీసు శాఖలది. అయితే జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి లేదు. ఒకవిధంగా చూస్తే మద్యం వ్యాపారుల అక్రమాలకు అధికారులే అండగా ఉన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే జిల్లా కేంద్రం, మారుమూల పల్లె అన్న తేడా లేకుండా మద్యం విక్రయాలు.. మందు బాబుల ఆగడాలు శృతి మించుతున్నాయి. మద్యం వ్యాపారులను పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు పిండేస్తున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు ఇప్పటికే తడిసిమోపెడైన ఫీజులతో వ్యాపారులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లోనూ వసూళ్ల దందాతో అధికారులు వ్యాపారులను పిండేస్తున్నారు. అడిగినంత చెల్లిస్తే మీరు ఏం చేసుకున్నా పట్టించుకోం.. లేకపోతే కేసులు పెడతామని పోలీసులు, దాడులు చేస్తామని ఎక్సైజ్ అధికారులు వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అధికారులకు నెలవారీగా మామూళ్లు సమర్పించుకుంటున్నారు. మామూళ్ల మత్తులో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తూగుతుండగా వ్యాపారులు యథేచ్ఛగా బెల్ట్ షాపులను నిర్వహించుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 337 మద్యం దుకాణాలు, 159 బార్లు ఉండగా వసూళ్ల మొత్తం నెలకు సుమారు కోటి రూపాయలపైనే ఉన్నట్లు తెలుస్తోంది. నెలకు రూ.20 వేలు చెల్లించాల్సిందేనని పట్టుబడుతూ అలా చెల్లించని వారిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఇబ్బంది పెడుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. అమాంతం పెంచగా వచ్చిన నగదులో కొంత మొత్తాన్ని కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు పంచుకుంటున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లా పరిధిలోని వ్యాపారుల నుంచి ఎక్సైజ్ శాఖలో ఉన్న మూడు విభాగాలతోపాటు పోలీస్ శాఖ కూడా మామూలు వసూలు చేస్తున్నట్లు (మిగతా 8వ పేజీలో)

- గుంటూరు ప్రతి మద్యం దుకాణం నుంచి నెలకు రూ.20 వేలుగా మామూళ్లను పోలీసు శాఖ ఫిక్స్ చేసినట్లు సమాచారం. గతంలో ప్రతి షాపు నుంచి నెలకు రూ.10 వేలను అందజేసే వారు. అయితే తాజాగా కొంత మంది పోలీసు అధికారులు ఈ మామూళ్ల మొత్తాన్ని అమాం తం పెంచేశారు. నెలకు రూ.20 వేలు చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు.
- పల్నాడు జిల్లాలో మద్యం షాపుల మామూళ్ల దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది ఒక్కొక్క షాపు నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు ఎక్సైజ్, పోలీస్ శాఖలు నెలవారీగా మామూళ్ల వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో మద్యం దుకాణదారులకు నెల వారీగా ఎక్సైజ్‌శాఖ మామూళ్లను ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఒక్కో దుకాణం నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బెల్ట్ దుకాణాల నుంచి కూడా ప్రత్యేకంగా నగదు సూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన మొత్తం నెలకు దాదాపు రూ.30 లక్షల వరకు ఉన్నట్లు మద్యం షాపుల యజమానులే చెబుతున్నారు.

వసూలు.. 37.06 శాతమే

- 19 రోజుల్లో రూ.399.71 కోట్లు సాధ్యమేనా?
- మున్సిపాల్టీల్లో మందకొడిగా పన్నుల వసూళ్లు
- మొండి బకాయి దారుల కుళాయిల తొలగింపు
- ఆస్తుల జప్తునకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు



మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా

మునిసిపాలిటీ	వసూలు లక్ష్యం (కోట్లలో)	పన్ను వసూలు (కోట్లలో)	వసూలు శాతం (కోట్లలో)
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	20.59	8.68	42.14
చిలకలూరిపేట	22.40	6.54	29.21
వినుకొండ	6.30	4.86	77.17
సత్తెనపల్లి	8.75	3.97	45.35
మాచర్ల	7.63	3.19	41.84
పిడుగురాళ్ళ	6.97	4.09	58.59
దాచేపల్లి	2.49	1.38	55.51
గురజాల	1.90	1.04	54.82
గుంటూరు జిల్లా :			
గుంటూరు	320.52	104.18	32.50
తెనాలి	30.07	15.45	51.37
మంగళగిరి, తాడేపల్లి	48.98	32.21	65.76
పొన్నూరు	7.40	4.31	58.24
బాపట్ల జిల్లా :			
రేపల్లె	6.57	3.78	57.51
బాపట్ల	12.90	5.41	41.91
చీరాల	13.69	7.43	54.31
అద్దంకి	5.12	3.67	71.80

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సంవత్సరం గడువు సమీపిస్తోంది. లక్ష్యం భారీగా ఉంది. అయినా మున్సిపాల్టీల్లో పన్నుల వసూలు మందకొడిగా సాగుతోంది. ఈ నెల 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి ఇంకా రూ.399.71 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికి 37.06 శాతమే వసూలైంది. గడువు 19 రోజులు మాత్రమే ఉన్నా ఆస్తి.. నీటి పన్నుల వసూల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. మున్సిపాల్టీల్లో లక్ష్యాల మేర పన్నుల వసూలు జరగడం లేదు. గుంటూరు కార్పొరేషన్ సహా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో రూ.635.16 కోట్ల పన్నుకు ఇప్పటి వరకు రూ.235.45 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ.522.23 కోట్లుకు రూ.210.13 కోట్లు, నీటి పన్ను రూ.112.93 కోట్లకు రూ.25.32 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఆస్తి పన్ను వసూలు 40.23, నీటి పన్ను 22.42 శాతాలుగా నమోదయ్యాయి. మొండి బకాయిదారుల కుళాయి కనెక్షన్లను గత కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. అయినా వారిలో చలనం అంతగా ఉండటంలేదు. ఆస్తుల జప్తునకు నోటీసులను జారీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మొండిబకాయిదారుల్లో మార్పు వచ్చి పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తారని అధికారులు ఎదురుచూస్తున్నారు. గడువు సమీపిస్తున్న తరుణంలో పన్నులు చెల్లించేందుకు ఇళ్ల యజమానులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు పని చేసేలా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. మొండి బకాయిలతో పాటు ప్రభుత్వ సంస్థల పన్ను రూ.కోట్లలో పేరుకుపోయి ఉంది. పన్నుల వసూళ్లపై పర్యవేక్షణ కొరవడటంతో అధికారులు, సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని మున్సిపాల్టీలు చతికిల పడుతున్నాయి. మార్చి నెలాఖరు కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఖాళీ స్థలాలు, ప్రకటనల పన్ను వసూళ్లలో కూడా జాప్యం జరుగుతున్నది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్ను పక్క దారి పడుతున్నది. రాజకీయ పైర వీలతో ఈ పన్ను చెల్లించడం లేదు.

- పల్నాడు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.10.38 కోట్లు బకాయి ఉంది. ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.5.05 కోట్లు బకాయి ఉంది. సత్తెనపల్లిలో ఎఫ్‌సీఐకి సంబంధించి రూ.5.20 కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల మున్సిపాల్టీలు పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. చిలకలూరి పేటలో 29.21 శాతం లోపే వసూలైంది. వినుకొండ మున్సిపాల్టీ 77.17 శాతం పన్ను వసూలుతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.
- గుంటూరు జిల్లాలో ఆస్తి పన్ను 4.6.97 కోట్లు, నీటి పన్ను రూ.85.65 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ.144.52 కోట్లు, నీటి పన్ను రూ.17.84 కోట్లు వసూలు చేశారు. గుంటూరు కార్పొరేషన్, తెనాలి మున్సిపాల్టీలో పన్నుల వసూలు దారుణంగా ఉంది. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

శింగరకొండ

తిరునాళ్లు ప్రారంభం

- ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి
- అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్న రవికుమార్

అద్దంకి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య మంత్రి గొట్టిపాటి రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి తిరునాళ్ల ఉత్సవాలను, గజవాహనసేవను ప్రారంభించారు. తొలుత మంత్రి, ఈవో తిమ్మానాయుడితో కలిసి ఆంజనేయస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శింగరకొండ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత శింగరకొండలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా సమీక్షిస్తానని



ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

చెప్పారు. నామ్ రోడ్డులో 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం నుంచి గుడి ముందుగా భవనాసి చెరువు కట్ట వరకు రోడ్డు విస్తరణ, దేవాలయానికి కొండపై భూమి కేటాయింపు తదితర అంశాలపై ప్రతిపాదనలు తయారు చేసి అందజేస్తే సంబంధిత శాఖల మంత్రులతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానన్నారు. సుమారు రూ.7 కోట్లతో చేపట్టిన రాతి ముఖ మండపం ప్రారంభం, కుంభాభిషేకం మే 19న శృంగేరి పీఠాధిపతుల అధ్వర్యంలో జరుగుతుందని మంత్రి తెలిపారు. ప్రధాన తిరునాళ్ల ఈ నెల 14 శుక్రవారం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, వేదపండితులు, పూజారులు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



- ఏటా రూ.కోట్లలో నష్టపోతున్న రైతులు
- ఆగని బిల్-టూ-బిల్, మచ్చు, దొడ్డికాపలా దొంగతనాలు
- ఎన్ని ప్రభుత్వాలు, అధికారులు మారినా అరికట్టలేని దుస్థితి

యార్డులో దోపిడీ

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ఎదిరించి.. తెగుళ్లను అధిగమించి.. ఆరుగాలం రెక్కల కష్టంతో రైతులు మిర్చి సాగు చేస్తుండగా.. యార్డుకు వచ్చిన వారు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు మారినా.. అధికారులు ఎంతమంది వచ్చినా గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను దోపిడీ చేసే విధానాలకు అడ్డుకట్ట పడటంలేదు. యార్డులో వేళ్లానుకొనిపోయి ఉన్న విధానాలను రూపుమాపడం ఎవరి తరం కావడం లేదు. బిల్-టూ-బిల్, మచ్చుకాయలు తీసుకోవడం, దొడ్డి కాపలాదారులు టిక్కీలను కోసి కాయలను దొంగలించడం వంటి విధానాలు యథాతథంగానే కొనసాగుతున్నాయి. గతంలో చైర్మన్‌లుగా విధులు నిర్వహించిన మన్నవ సుబ్బారావు, నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు హయాంలో కొన్ని రోజుల పాటు మచ్చు కాయలు తీయనీయకుండా, యార్డులోకి ఇతరులు ప్రవేశించకుండా అడ్డుకున్నారు. దొంగతనంగా తీసుకొచ్చిన మిరపకాయలను యార్డు వెలుపల కొనుగోలు చేస్తున్న దుకాణాలను కూడా మూసేయించారు. దాంతో కొంతమంది నేతలు హమాలీలను ఎగదోసి యార్డులో ధర్నాలు, ఆందోళనలు, ఆఫీసులపై దాడులు చేయించారు.

- యార్డులో ఆర్థిక స్తోమత తక్కువగా ఉన్న వ్యాపారుల వద్దకు వచ్చే బడా వ్యాపారులు ఫరం పేరుతో బిల్ చేస్తున్నారు. రైతు వద్ద అధికారికంగా 2 శాతం, అనధికారికంగా మరో 2 నుంచి 3 శాతం కమీషన్ వసూలు చేసి ఇద్దరు పంచుకుంటున్నారు. ఈ బిల్-టూ-బిల్ వ్యాపారం నిత్యం జరుగుతూనే ఉంటుంది.
- రైతులు తీసుకొచ్చిన మిర్చిని ఎగుమతి దారులకు చూపించేందుకు టిక్కీలు కోసి ప్లాట్‌ఫాంపై హమాలీలు కుప్ప పోస్తారు. కొనుగోళ్ల తర్వాత ఒక్కో లాట్ నుంచి కేజీలకు కేజీల మచ్చుకాయలు తీసుకుంటున్నారు. మచ్చుకాయలు తీసిన తర్వాతనే కాటాలు జరుగుతాయి. దీంతో ఇటు కమీషన్ వ్యాపారి, అటుఎగుమతి దారుడికి ఎలాంటి నష్టం ఉండదు. రైతే నష్టపోతున్నాడు.
- రైతులు తీసుకొచ్చిన మిర్చి విక్రయం జరగకపోతే మరుసటి రోజు కోసం దొడ్డి కాపలాదారులకు కాపలాగా పెట్టుకోవాలి. ఇందుకు టిక్కీకి నిర్ణయించిన కాపలా ఫీజుని వారికి రైతులు చెల్లించాలి. దొడ్డికాపలాదారులు రాత్రివేళ టిక్కీలు కోసి దొంగతనంగా కాయలు బయటకు తరలిస్తున్నారు.

ముగిసిన జాతీయ స్థాయి ఎడ్లపోటీలు

- సీనియర్స్ విభాగంలో నంద్యాల జతకు ప్రథమ స్థానం

6

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి





మృతి చెందిన తేజ్‌కుమార్, వెంకటగోపి

నరసరావుపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన ఇద్దరి యువకులు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన నరసరావుపేట మండలం పెట్లూరు వారి పాలెం వద్ద చిలకలూరి పేట మేజర్ కాల్వలో బుధవారం చోటుచేసుకుంది. చెన్నైపాలెం తేజ్ కుమార్(19), బొరుగొర్ల వెంకటగోపి(22) అనే యువకులు మృతి చెందా రు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన ఏఎంరెడ్డి కళాశాలలో తేజ్‌కుమార్ పాలిటెక్నిక్ చదువు తున్నాడు. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం వీరయ్యపాలెం గ్రామానికి చెందిన వెంకటగోపి స్థానిక ఎన్ఈసీ ఇంజ నీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుకుంటున్నాడు. స్నేహితులైన వీరిద్దరూ కోటప్ప కొండ రోడ్డులోని ఓ హాస్టల్ ఉంటున్నారు. స్నేహితులైన మరో ఇద్దరితో కలిసి వీరు చిలకలూరిపేట మేజర్ కాల్వలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో తేజ్ కుమార్, వెంకటగోపి లోతుగా ఉన్న కాల్వ దిగారు. ఎంతసేపటికీ పైకి రాక పోవడంతో స్నేహితులు సమీపంలోని రైతులకు సమాచారం ఇచ్చారు. వారం తా కలిసి కాల్వలో గాలించినా ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నరసరావు పేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 521.60 అడుగులు ఉంది. ఇది 152.21 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7684 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,787 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 9259 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల పందాలు

సీనియర్స్ విభాగంలో నంద్యాల జతకు ప్రథమస్థానం

రాజుపాలెం,మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 96వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల పందాలు ముగిశాయి. బుధవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా పెదకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా ఉజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డిలకు చెందిన కంబైన్స్ ఎడ్లజత 25 నిమిషాల నిర్ణీత కాలవ్యవధిలో 2842.11అడుగుల దూరంలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా సిరివెల్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంగోపాల్ రెడ్డికి చెందిన ఎడ్లజత 2334.10అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలువగా తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన గాయం సృజనారెడ్డి శ్రీధర్‌రెడ్డి,



సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి కటికం లక్ష్మణ్ కుమార్‌కు చెందిన కంబైన్స్ ఎడ్లజత 2212 అడుగుల దూరంలాగి మూడవస్థానంలో, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 2118.9అడుగుల దూరంలాగి నాల్గో స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషాచౌదరి శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 2000 అడుగుల దూరంలాగి ఐదవస్థానంలో, ప్రకాశం జిల్లా రాసర్ల మండలం పుల్లలచెరువుకు చెందిన బొర్రా రవితేజకు చెందిన ఎడ్లజత 1276 అడుగుల దూరంలాగి ఆరవస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారంకు చెందిన లక్కుసాయి సాత్విక్ ఎడ్లజత 1187అడుగుల దూరంలాగి ఏడవస్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండలం కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు సత్యానారాయణ ఎడ్లజత 754.6అడుగుల దూరంలాగి ఎనిదవ స్థానంలో నిలిచాయి.

సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనంతో తీర్చిదిద్దాలి

● ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నగరానికి అతి పెద్ద ప్రధాన రహదారి అయిన సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనానికి, ప్రకృతి వైభవానికి అనవాలుగా తీర్చిదిద్దాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె సీడ్ యాక్సెస్ రోడ్డుపై జరుగుతున్న రోజువారీ నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవిలోకి అడుగుపెట్టిన తరుణంలో మొక్కలకు అధిక ఉష్ణోగ్రతలను గ్రహించే శక్తిగా బలాన్ని చేకూర్చాలని సూచించారు. అతి సుందరమైన ఈ రహదారిపై మొక్కల మధ్య ఖాళీలు ఉన్న చోట సూర్యరశ్మిని తట్టుకునే శక్తివంతమైన పూల మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సీడ్ యాక్సెస్ సెంట్రల్ మీడియన్ మీద డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి మొక్కలకు సమృద్ధిగా నీరందించాలని జైన్ ఇరిగేషన్ ప్రతినిధి జితేంద్రకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్‌జోన్ అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఏడీసీ నిర్మాణం చేపడుతున్న రహదారులపై ఎక్కడా నీటి నిల్వలకు తావు లేకుండా జాగ్రత్తలను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించా రు. ఈ పర్యటనలో ఏడీసీ జనరల్ మేనేజర్ కే శ్రీహరిరావు, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి ధర్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.



రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డుపై పచ్చదనాన్ని పరిశీలిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

నేడు పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),మార్చి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా,గుంటూరు,ప్రకాశం జిల్లాల పరిధిలోని భవిష్యనిధి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు నేడు పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పెన్షన్ అదాలత్‌కు ఫిర్యాదులు పంపాలని ఈ సందర్భంగా సూచించారు. ఫిర్యాదులు ro.guntur@epfindia.gov.inఅనే మెయిల్‌కు, లేదా 9494657469అనే వాట్సప్ నెంబర్‌కు,26409929697 వెబ్‌ఎక్స్ ఐడీకి, పాస్కోడ్ epfo@1234కు పంపాలని సూచించారు.

ఈపీఎఫ్ పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఈపీఎఫ్, ఎస్‌పీఎస్ పెన్షన్ దారులు నిర్ధేశించిన తేదీల్లోగా జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిపికెట్స్) సమర్పించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు నుంచి పెన్షన్ తీసుకుంటే మీసేవా, పీఎఫ్ కార్యాలయం లేదా, పోస్ట్ ఇన్ఫోయాప్, ఆధార్ ఫెస్ యాప్ ద్వారా పత్రాలు సమర్పించాలని సూచించారు.

15న విద్యారంగ సమస్యలపై నిరసన

ఈనెల 15న విజయవాడలో విద్యారంగ సమస్యలపై నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ వెల్లడించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే నిరసన దీక్షలను విద్యార్థులు జయప్రదం చేయవలసిందిగా కోరారు.

శ్రీవారికి 9కిలోల బంగారుపూత ఆభరణాలు

● మొక్కు తీర్చుకున్న రాజధాని రైతు

తుళ్లూరు(వెంకటపాలెం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామం వెంకటపాలెం వేంకటేశ్వర స్వామికి 9కిలోల బంగారు పూత కలిగిన వెండి ఆభరణాలను నేలపాడు రైతు ధనేకుల రామారావు బుధవారం బహూకరించారు. స్వామి చతురహస్తాలకు, శంఖు చక్రాలకు తొడుగు ఆభరణాలు 11.5లక్షలతో చేయించి టీటీడీ అధికారులకు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని నిలిపివేసి రోడ్డు పాలు చేయటంతో ఉద్య మం చేపట్టారు. అందులో నేలపాడుకు చెందిన ధనేకుల రామారావు రైతు సమన్వయ కమిటీ సభ్యులుగా ఉన్నారు. రాజధాని అమరావతిని భగవంతుడు రైతులకు తోడుండి కాపాడాలని వెంకటపాలెం శ్రీవారి ని అప్పుడు మొక్కుకున్నారు. భగవంతుడి దయతో కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం సంతరించుకోవటంతో మొక్కు తీర్చుకున్నానని రామారావు చెప్పారు. కార్యక్రమంలో వెంకటపాలెం రైతు జేఏసీ నాయకులు లంకా సుధాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) డిప్యూటీ ఈవో శివప్రసాద్, సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌లు రామకృష్ణ, సాయి గణేష్ పాల్గొన్నారు.



టీటీడీ అధికారులకు శ్రీవారి ఆభరణాలు అందజేస్తున్న నేలపాడు రైతు ధనేకుల రామారావు

వైసీపీ పాలనలో అడుగుకో కీచకుడు : చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో ఒకడే కీచకుడు ఉంటే వైసీపీ పాలనలో మాత్రం రాష్ట్రంలో అడుగుకో కీచకుడు మహిళలను వేధించాడని, వారిపై నేరాల్లో రాష్ట్రాన్ని తలవంచుకునే పరిస్థితుల్లో నిలబెట్టారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో ధ్వజమెత్తారు. ఎక్కడ మహిళలు గౌరవం అందుకుంటారో అక్కడ దేవతలు కొలువుతీరుతారని చంద్రబాబు నమ్మితే ఆ మాటలకు అర్థం లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. శాసనసభలో మహిళాసాధికారతపై చర్చ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బుధవారం మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలకు చేసిన అన్యాయంపై నిప్పులు చెరిగారు. మొదటి నుంచి మహిళా పక్షపాతిగా ఉన్న చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో వారి దశ మార్చితే జగన్ వారిని రోడ్లపాలు చేశారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళలకు రూ.18వేల కోట్లు పసుపుకుంకుమ కింద ఇస్తే జగన్ కల్తీ మద్యంతో 30వేల మంది అక్కాచెల్లెమ్మల తాళిబొట్లు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా చేసి పట్టపగలు కూడా ఆడవారు రోడ్లపై తిరగలేని పరిస్థితి తెచ్చారన్నారు. వైసీపీ పాలనలో 250మంది ఎస్సీ మహిళలు, ఎస్టీ ఆడబిడ్డలు 2 వేల 27 హత్యలకు గురయ్యారన్నారు. మహిళలపై 2,04,414నేరాలు జరిగాయని, ఒక్కమాటలో చెప్పాలంటే గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రంలో పరిస్థితి తాలిబన్ల పాలన కంటే ఘోరంగా తయారు చేశారని అన్నారు. సుమారు 4,034 అత్యాచారాలు జరిగాయని, 22,272మంది మహిళలు అదృశ్యమయ్యారని, అయినా వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు.



అసెంబ్లీ మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ఆగిన ఇళ్లకు అదనపు సాయం

◆ ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు.. ఎస్టీలకు రూ. 75వేలు

◆ గుంటూరు జిల్లాలో 14,112 మందికి చేకూరనున్న లబ్ధి



గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేదల గూడుపై కూటమి ప్రభుత్వం పెద్ద మనసు చూపింది. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహాయంతో ఇళ్లు నిర్మించుకుందామని ఆశపడి ఇళ్లు కట్టుకోలేక మధ్యలోనే ఆపేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్దిదారుల ఇళ్లకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో జగనన్న కాలనీల పేరుతో మొదలై అర్థాంతరంగా ఆగిపోయిన పేదల ఇళ్లు సహా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించుకుంటున్న ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 14,112 మంది పేదల ఇళ్ల నిర్మాణానికి మోక్షం కలగనుంది. ఎస్సీ, బీసీల ఇళ్లకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తోంది. దీంతో ఎన్టీఆర్ నగర్లుగా రూపాంతరం చెందిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి మోక్షం లభించినట్లయింది.

● 14,12 మందికి లబ్ధి: కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లలో 14,112 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 6,530 మంది ఎస్సీలకు రూ. 50వేలు, 1,213 మంది ఎస్టీలకు రూ. 75వేలు, 6,369 మంది బీసీలకు రూ. 50 వేల చొప్పున ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. అయితే లబ్దిదారుల ఇళ్లు 2024 డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉంటేనే ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,40,254 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,39,436 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,40,254 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,733 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నంబరు. 5	10000	14000
273	10000	13000
341	10500	14500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11000	12400
బ్యాడిగి 355	10000	13800
సింజెంటా		
బ్యాడిగి 5531	10500	12200
దేవనూరు డీలక్స్	11500	13500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	7500

నగర పాలక సంస్థ, గుంటూరు

Roc No. 324974/2021/G1, Dated :11-03-2025

పత్రికా ప్రకటన

AP బిల్డింగ్ రూల్స్ - 2017 (సవరించబడిన) నియమం 167 మరియు 168 కింద అందించబడిన అధికారం ప్రకారం, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా పట్టణ స్థానిక సంస్థలు రోడ్డు విస్తరణ వంటి ప్రజా ప్రయోజనాల కోసం ఏదైనా ప్రైవేట్ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి హక్కుల బదిలీని (TDR) ఉపయోగించుకుంటున్నాయి.

దిగువ జాబితా చేయబడిన (TDR) లు వివిధ రహదారుల కోసం / కొత్త రహదారి కోసం / రహదారి విస్తరణ కోసం / పబ్లిక్ పర్పస్ కోసం TDR బాండ్లను జారీ చేయాలని ప్రతిపాదించబడింది.

SL. NO	NAME OF THE LAND OWNER (SRI/SMT)	D.NO/ T.S NO/ R.S NO	NAME OF THE VILLAGE	DOOR NO.	EXTENT OF THE SITE AFFECTED / REQUIRED	STATUS OF THE LAND (VACANT/ BUILDING)
JKC COLEGE (MAHALAKSHMI BAR TO RTO OFFICE) ROAD						
1	Sri Umamaheswara Rao Chirumamilla, S/o Radha Krishna Murthy	D No.110	Koretipadu	NIL	48.49 Sq.mts	VACANT
2	Smt Chirumamailla Satyavathi W/o Seshagiri Rao	D.No.114	Koretipadu	NIL	104.25 Sq.mts	VACANT
3	Ramawelfare Owners welfare association, Guntur, President KoneruVenkata Krishna Rao S/o Veeranjaneyulu	D.No.266(p), 267(p)	Pedapalakaluru	NIL	79.79 Sq.mts	VACANT
MAHATMA GANDHI INNER RING ROAD PHASE-3 FROM SWARNA BHARATHI NAGAR TO PEDAPALAKALURU						
4	Sri Chaparala Narasimha Rao S/o Surya Prakasa Rao	D.No.445-1E	Pedapalakaluru	NIL	149.0 Sq.mts	VACANT
NTR STADIUM JUNCTION TO CH HANUMAIAH STATUE JUNCTUION (BRUNDAVAN GARDENS MAIN ROAD)						
5	Smt Doddapaneni Usharani W/o Pulla Rao	D No.15/E	Nallapadu	NIL	84.04 Sq.mts	VACANT
6	Sri Gavini Sai Babu S/o Raghavaiah	D No.20/B & 20/C	Nallapadu	NIL	75.08 Sq.mts	VACANT
ROAD WIDENING FROM GUJJANAGUNDLA JUNCTION TO OLD GMC LIMITS(PEDAPALAKALURU ROAD)						
7	Sri Ravipati Saida Rao S/o Devendra Rao	D No.269/1 & 269/2	Pedapalakaluru	NIL	63.96 Sq.mts	VACANT
KUGLAR HOSPITAL ROAD						
8	Modugula Suvarna Lakshmi W/o Srinivasa Rao	TS No.817	Guntur	12-25-175/A	7.97 Sq.mts	BUILDING
9	Pawan Devarapu S/o ramamohanrao (late)	TS No.62	Guntur	12-25-176	40.37 Sq.mts	BUILDING
10	Dhulipalla Ramesh S/o KoteswaraRao	TS No.62	Guntur	12-25-179	31.95 Sq.mts	BUILDING
AT AGRAHARAM MAIN ROAD						
11	Sri Jagarlamudi Bhaskar Rao S/o Ramanaiah	WARD 17, BLOCK NO 1, T.S NO 5	Guntur	26-19-116	25.83 Sq.mts	BUILDING
12	Sri Vippadapu Subba Rao S/o Narayana	T.S.No 37, Ward-17, Block-2	Guntur	26-20-55	62.76 Sq.mts	BUILDING

అందువలన పై పేర్కొన 12 టిడిఆర్ బాండ్ల జారీ చేయు విషయమై గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయము నుండి ఈ ప్రకటన జారీ చేయబడిన తేదీ నుండి 07 రోజులలోపు తమ అభ్యంతరాలు / సూచనలు ఏమైనా ఉంటే లిఖితపూర్వకంగా సమర్పించాలని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు పైన పేర్కొన టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయబడుతుంది.

సం/- **కమీషనర్,** నగరపాలక సంస్థ, గుంటూరు



ఏఆర్ ఎస్ఐ సతీమణికి ఫ్లాగ్‌ఫండ్, విడోఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ ఎస్ఐ ఎం.సంపూర్ణరావు సతీమణి మార్తమ్మకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫ్లాగ్‌ఫండ్, విడోఫండ్ చెక్కులను ఎస్పీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణరావు భార్య మార్తమ్మకు విడోఫండ్ రూ.50 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ.25 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. పోలీసుశాఖలో అంకితభావంతో పనిచేసే వారు మృతి చెందటం బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కె.రాధిక ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో శాస్త్రవేత్తలకు శిక్షణ

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో వివిధ విభాగాలలో పని చేస్తున్న శాస్త్రవేత్తలకు ఎక్స్‌పర్‌మెంటల్ డేటా ఎనాలిసిస్ యూజింగ్ ఎ సాఫ్ట్‌వేర్ అనే అంశంపై 10 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంఖ్యక శాస్త్ర, కంప్యూటర్ విభాగ యూనివర్సిటీ అధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి శిక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.కిరణ్‌ప్రకాష్, డాక్టర్ డి.రమేష్‌లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్, ఒడిస్సా, అస్సాం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మొదలుగు రాష్ట్రాలు నుంచి శిక్షణకు హాజరయ్యారని కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి

సహజ సబ్బుల తయారీతో జీవనోపాధి

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల వారి ఆదాయ, జీవనోపాధి మెరుగుదలకు సహజ సబ్బుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ తెలిపారు. పట్టణంలోని ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో ఐసీఏఆర్ సహకారంతో ఈతేరు గ్రామానికి చెందిన ఎస్సీ మహిళలకు బుధవారం సహజ సబ్బుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న మహిళలు, నిరుద్యోగ యువత చిన్నకుటీరపరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించాలన్నారు. బ్లిస్‌బ్లూమ్ హెర్బల్స్ ప్రతినిధి లక్ష్మీ సోము మాట్లాడుతూ కేవలం రూ.500లతో మొదలు పెట్టి నేడు రూ.6లక్షల టర్నోవర్‌తో కంపెనీని నడిపిస్తున్నానని తెలిపారు. ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ ఇ.గౌతమి, డాక్టర్ ఎస్.బ్లెస్సీసాగర్, కె.సౌజన్యలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మార్తమ్మ, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎన్.వినోద, డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ వై.అరుణకుమారి, డాక్టర్ బి.సునీత, డాక్టర్ వై.దిలీప్‌సేన్, డాక్టర్ వై.ఫణేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులను కాపాడాలి

- మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- పోలీసులను నెట్టుకొని కలెక్టరేట్‌లోకి వెళ్ళిన వైసీపీ శ్రేణులు



పోలీసులను నెట్టుకొని వెళుతున్న మేరుగ నాగార్జున, వైసీపీనాయకులు

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన యువతపోరు కార్యక్రమం రథంబజారు నుంచి ర్యాలీగా పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ మీదగా కలెక్టరేట్‌కు చేరుకుంది. కలెక్టరేట్ లోపలికి వెళ్ళటానికి కొంతమందికి మాత్రమే అవకాశం కల్పిస్తామని పోలీసులు బారికేడ్‌లు పెట్టి అడ్డుకున్నారు. అయితే నాయకులు తామంతా లోపలికి వెళ్ళాల్సిందేనంటూ భారికేడ్‌లు నెట్టుకొని మరి వెళ్ళారు. కలెక్టర్ ఛాంబర్‌లోకి వెళ్ళేందుకు ప్రయత్నించగా డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కేవలం నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు మాత్రమే అవకాశం కల్పించటంతో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, పర్చూరు ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, రేపల్లె ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్, అద్దంకి ఇన్‌చార్జి హనిమిరెడ్డిలు కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్దంగా వినతిపత్రాన్ని అందజేయటానికి వస్తుంటే మూడుచోట్ల పోలీసులు అడ్డుకోవటం సరికాదన్నారు. విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన పోతుల హరిబాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఏడుకొండలురెడ్డి, డి.సీతారామిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, యువజన అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల అధ్యక్షుడు చల్లా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

వైసీపీ ఆవిర్భావ దినోత్సవంను బుధవారం బాపట్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రథం బజారులోని వైసీపీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున జెండా ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, రేపల్లె ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్, అద్దంకి ఇన్‌చార్జి హనిమిరెడ్డి, పర్చూరు ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పెదగొల్లపాలెం హైస్కూల్‌కు కంప్యూటర్‌లు వితరణ

కర్లపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కోరమాండల్ ఫర్టిలైజర్స్, కర్లపాలెం మనగ్రోమోర్ ఆధ్వర్యంలో బుధవారం లక్ష రూపాయల విలువ కలిగిన రెండు కంప్యూటర్‌లను సంస్థ ప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ భానుప్రకాష్, జోనల్ హెచ్‌ఆర్ మణికంఠ, మార్కెటింగ్ మేనేజర్‌లు వికాస్, రేవంత్, రాంబాబు, సాయి, కర్లపాలెం మనగ్రోమోర్ మేనేజర్ కారంకి సతీష్, వంశీ, అయ్యప్పస్వామి, ఈశ్వరాచార్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి కళ్యాణం

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భట్టిప్రోలులోని మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణానికి అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహోత్తమ సంఘం వారు తలంబ్రాలు, బియ్యం, మెట్టెలు, మంగళసూత్రాలను సమర్పించారు. అద్దేపల్లి నుంచి భ్రమరాంబ అమ్మవారు ప్రత్యేక వాహనంపై మేళతాళాలతో ఊరేగింపు తీసుకురాగా స్వామివారు ఆలయం నుంచి ప్రత్యేక వాహనంలో తోడ్కోని ఎదురు కోలోత్సవం నిర్వహించారు. తిరువీధుల నాని నాగార్జున, డాక్టర్ రోజా దంపతులు స్వామి వారి కళ్యాణ పూజల్లో పాల్గొన్నారు. పూజాది కార్యక్రమాలను కౌత సత్యవెంకటనాగరాజేష్‌శర్మ, దండిబొట్ల రాజేంద్రప్రసాద్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కొడాలి లక్ష్మీకాంతరావు, పానకాలరావు, రామశాస్త్రి శంకరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.కుమార్‌బాబు, పద్మశాలీయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థికసాయం

- కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ, బీసీలకు గృహాలు మంజూరై వివిధ దశలలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేసుకోవటానికి అదనపు ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-2024 మధ్యకాలంలో ఎస్సీ ఎస్టీ, బీసీలకు మంజూరైన గృహాలు 16,085 వివిధ దశలలో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్‌ల సమావేశంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహనిర్మాణాల విషయమై కలెక్టర్‌లు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళటం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తక్షణమే గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవటానికి చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. డిసెంబరు 30వ తేదీ లోపు నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలకు కూడా ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసుకోవటానికి స్వయం సహాయక సంఘాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బ్యాంక్‌లోన్ సౌకర్యం కల్పించటానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గృహ నిర్మాణం పూర్తి విలువ రూ.లక్షా80 వేలు కాగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఆర్థికసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తుందని ఆయన తెలిపారు. గృహనిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి దశల వారీగా అదనపు మొత్తాన్ని వారి ఖాతాలకు జమ చేయటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ వై.వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ మరింత బలోపేతానికి చర్యలు : కలెక్టర్

చట్టపరమైన చట్రంలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయటానికి పరస్పర చర్యల కోసం భారత ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులను, సీనియర్ నాయకులను ఆహ్వానిస్తున్నదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ స్థాయిలో ఏమైన పరిష్కరించని సమస్యలు ఉంటే ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానిస్తున్నదన్నారు.

డివిజనల్ పంచాయతీ అధికారిగా కుమారస్వామి

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎస్.కుమారస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వెస్ట్ బాపట్ల గ్రామసచివాలయంలో డీఎల్‌పీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం ఈవోపీఆర్డీలు అమర్తలూరు ఏలీషాబాబు, ఐనంపూడి శ్రీనివాసరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆయనను కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు.

వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల సంతానోత్పత్తి నిరోధించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఆయన ఛాంబర్‌లో బుధవారం స్నే యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వైద్యులు డాక్టర్ మేరీ నీలం, డాక్టర్ అనూజ్ దేశవాల్, డీఈ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో సమావేశమై చర్చించారు. కుక్కలకు ఆపరేషన్ చేస్తే ఒక్కొక్క దానికి రూ.1400 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. అనంతరం రాజీవ్ గాంధీకాలనీలోని చికిత్సాలయాన్ని పరిశీలించారు. మూడురోజుల్లో ఆపరేషన్‌లు ప్రారంభిస్తామని చెప్పారు.



స్నే యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వైద్యులతో సమావేశమైన కమిషనర్ జి.రఘునాథరెడ్డి

డిప్యూటీ కలెక్టర్‌ల డైరీ ఆవిష్కరణ

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ కలెక్టర్‌లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ల డైరీని బుధవారం కలెక్టర్ జె.వెంకటమురళి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 10వ తరగతి పరీక్షలు, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె.విజయానంద్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో చర్చించి పలుసూచనలు చేశారు. 10వ తరగతి పరీక్షలు, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు, పి4సర్వే తదితర అంశాలపై సూచనలు చేశారు. విద్యార్థులకు తగిన వసతులు కల్పించి పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయాలన్నారు. ఎన్టీఆర్ భరోసా, రెవెన్యూ సర్వీస్, ఆసుపత్రులు తదితర అంశాలపై చర్చించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సీపీవో శ్రీనివాసరావు, డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డీపీవో ప్రభాకర్, డీఎల్‌డీవో విజయలక్ష్మి, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత ఇనుము, ట్రాక్టర్‌లకు వేలం

బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో ఎంతోకాలంగా మూలనపెట్టి ఉంచిన పాత ఇనుము, పాత ట్రాక్టర్ ఇంజన్లకు బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో రూ.13 వేల చొప్పున డిపాజిట్ చేసి 34 మంది పాడుకున్నారు. 4 ట్రాక్టర్ ఇంజన్‌లను పఠాన్‌ఖాదర్ రూ.1,37,500కు పాడుకున్నారు. పాత ఇనుము కిలో రూ.27.50 పైసలు చొప్పున కె.రాంబాబు పాడుకున్నారు. ఆటోలు, కలప పాడుకునేందుకు ముందుకురాకపోవటంతో వాటి పాటను వాయిదా వేశారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మూలపాలెం యువత

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం బాబురావు, భూపతి సాయితేజ, మిక్కిలి సురేష్, పేరం చిన్న బుధవారం జనసేన పార్టీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు దాసరి ఏసుబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హుస్సేన్‌బేగ్, జిడుగు విజయమాధురి, గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ, సుబ్బరాజు, పడమటి ధర్మారావు, సత్యనారాయణ, కొక్కిరాల రాజేంద్ర, గంటా నాగమల్లేశ్వరరావు, బడే అంకమ్మరావు, కెఆర్‌కె నాయుడు, సంగీతం ఏసోబు, సయ్యద్ అన్సారి, జహీర్‌బాషా, జాకీర్ హుస్సేన్, చల్లాపల్లి ఏసోబుపాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాలను వినియోగించుకోవాలి

- సమగ్రశిక్ష బాపట్ల సహిత విద్యావిభాగం కోఆర్డినేటర్ జోత్స్న

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : క్లస్టర్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకొని నిర్దిష్ట విధానాలతో ముందుకెళ్ళాలని సమగ్ర శిక్ష బాపట్ల సహిత విద్యావిభాగం కోఆర్డినేటర్ ఎం.జోత్స్న సూచించారు. మండలంలోని అప్పికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్లస్టర్ సమావేశానికి పరిశీలకురాలిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విధానాలతో ఏర్పాటు చేస్తున్న అంశాలపై అవగాహన పెంచుకొని విద్యార్థులను వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ చైర్‌పర్సన్ యూవీ సుధారాణి, పూండ్ల ప్రధానోపాధ్యాయులు బి.రాజు, బాలాజిరావు, హర్షతుల్లా, రోహిణికుమార్, సీఆర్‌ఎంటీ మాణిక్యారావు పాల్గొన్నారు.

డొంక మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం బర్తీపూడి గ్రామంలో డొంకమట్టిని అక్రమంగా తవ్వి తరలించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అప్పికట్ల గ్రామానికి చెందిన కంతేటి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈవిషయమై తహసీల్దార్ షేక్ సలీమాను వివరణ కోరగా మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీవన శాస్త్రంలో నూతన పోకడలపై సెమినార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీవీ కృష్ణ

నగరం, మార్చి12(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీవెలగపూడి రామకృష్ణ కళాశాలలో బయోలజీ, బోటనీ విభాగాల ఆధ్వర్యంలో జీవనశాస్త్రంలో నూతన పోకడలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ జంతుశాస్త్రం, వృక్షశాస్త్రంలో ఇతర అనుబంధ శాస్త్రాల అభివృద్ధితో శాస్త్రీయ, సాంకేతిక, ఆరోగ్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రొఫెసర్ పీవీ కృష్ణ మాట్లాడుతూ ఆక్వారంగంలో చేపలు, రొయ్యల పెంపకం కోసం నూతన అంశాలు డేటా సైన్స్, సెన్సార్లు వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించట ద్వారా పరిశ్రమలలో విశిష్ట పురోగతి సాధించవచ్చన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కస్తూరి మాట్లాడుతూ బయోటెక్నాలజీ ఇన్‌ఫర్మ్యాటిక్స్ అనేవి సమాచార సాంకేతికతో ముడిపడిన శాస్త్రాలు అని వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్, బయోలజీ విభాగాల అధిపతి, కోఆర్డినేటర్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా అతిథులను సత్కరించారు.

టీఎం రావు పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సదస్సు

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో మాచర్ల వెంకటేశ్వరరావు సహకారంతో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సదస్సులో హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ్ పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు విద్య, ఆరోగ్య విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, కో-ఆర్డినేటర్ చెన్నా వెంకట ఉమామహేశ్వరరావు, మురళీధరరావు, సుబ్బారావు, కోటేశ్వరమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

17న అర్ధనగ్న ప్రదర్శన

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో చేనేత రంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 17 అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ అన్నారు. స్థానిక చేనేత సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పరిశ్రమకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని, జీఎస్‌టి తొలగించాలని కోరారు. బడ్జెట్‌ను సవరించి చేనేత పరిశ్రమకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, కె.వీరమోహనరావు, ఏఐటీయూసీ నాయకులు బండారు శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ క్రియాశీలక కార్యకర్త సాంబశివరావు మృతి

వేమూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త ఆలపాటి సాంబశివరావు (60) మంగళవారం రాత్రి స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాంబశివరావు మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, పలువురు టీడీపీ నాయకులు సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సాంబశివరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్


తాగునీటి కుండలు పంపిణీ

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని వాసవీ క్లబ్, కుబేర వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ యండూరి వెంకటనాగరాఘవేంద్రరావు, రీజియన్ సెక్రటరీ సీహెచ్ శివబ్రహ్మయ్య కుండల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బూరెల వెంకట చంద్రశేఖర్, బూరెల కిరణ్‌కుమార్, తూనుగుంట్ల వెంకటేశ్వరగుప్తా, బూర్లె సుబ్బారావు, సీహెచ్ వెంకట ఉమామహేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, బి.రాంప్రసాద్, టి.శ్రీధర్, మద్దుల లక్ష్మీప్రియపాల్గొన్నారు.

అల్లూరులో ఉచిత వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరులో బడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ, హెల్త్ కేర్ మెడికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన ఒమేగా హాస్పటల్స్ సౌజన్యంతో ఈనెల 16న ఉదయం ఉచిత ఆరోగ్య శిబిరం జరుగుతుందని బడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ ప్రెసిడెంట్, ఫౌండర్ షేక్ ఫజుల్‌రహమాన్, ఆర్గనైజర్ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స నిమిత్తంగా ఆయిన ఖర్చును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు తెలియజేసి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు. స్పందించిన ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3,00,116 మంజూరు చేయించారు. సంబంధించిన చెక్కులను జొన్న రాణమ్మకు రూ.60 వేలు, నూరుబాషా ఖాసీంవలికి రూ.54,381, షేక్ మస్తాన్‌వలికి రూ.50,933, గుమ్మా కోటేశ్వరరావుకి రూ.50 వేలు, షైలా బిక్షాలుకు రూ.48,016, షేక్ శంషాద్‌కు రూ.30,786, తాడిబోయిన ప్రియాంకకు రూ.25 వేల చెక్కులను గుంటూరు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రేపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ గోదాసమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వేదమంత్రోచ్ఛరణతో ఘనంగా నిర్వహించారు. ఉప్పుడి రోడ్డులోని గోదా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయన్నారు. అనంతరం 10 వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని సాయికుమార్, దండుప్రోలు పిచ్చియ్య, దేవగిరి రవి, ఆగస్త్య, ల్యాబ్‌కిషోర్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాంబశివరావు

రేపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి, మెప్మా సిబ్బందికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించటానికి తీసుకునే చర్యలపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దుకాణ యజమానులు, పండ్ల, పూలవ్యాపారులు, హోటల్స్ వారు పాలిథిన్ కవర్‌లలో అమ్మినయెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, సీహెచ్ అరుణకుమారి, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

రేపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానంపై అవగాహన పెంపొందించుకోవాలని శిక్షకురాలు వి.లక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ పట్టణంలోని తడవర్తి రామ్మోహన్‌రావు సత్రంలో ఈనెల 14 నుంచి ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు, మొత్తం 41 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

16న నాగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొరికపూడిలో భ్రామరి దుర్గాదేవి సమేత నాగేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 16న ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బి.రాజేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, ఎంపీలు టి.కృష్ణప్రసాద్, బాలశౌరి, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బుద్ధప్రసాద్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

జనసేన సమన్వయ కమిటీ మెంబర్లు నియామకం

వేమూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈనెల 14న జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలించేందుకు సమన్వయ కమిటీ మెంబర్లును నియమించారు. కమిటీలో పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనురాధ, మండల పార్టీ కార్యదర్శి కలవ వెంకటసుబ్బయ్య గుప్తాలను నియమించారు. ఐదు మండలాల పరిధిలో పర్యటించి ఆవిర్భావ దినోత్సవానికి పిఠాపురానికి తరలివెళ్లే విధంగా కృషి చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులకు సూచించారు.

ఆదరణ పథకాలపై బీసీ కుల సంఘాలకు అవగాహన

పిట్టలవానిపాలెం, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు అధ్యక్షతన బుధవారం ఆదరణ ఫేస్-3 పథకంపై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీసీ కుల సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారితో ప్రభుత్వ ఆదరణ పథకం కింద అందించే వివిధ రకాలైన పనిముట్లుకు సంబంధించి కంపెనీల బ్రాండ్‌లు, వాటి వివరాలను తెలియజేశారు. బీసీకులాసులు దరఖాస్తు చేసుకునేందుకు బీసీ సంఘాలు సహరించాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, కులసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించలేదని హాల్‌టిక్కెట్టు ఆపితే చర్యలు : డీఈవో


బాపట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు ఫీజు చెల్లించలేదనే కారణంతో హాల్ టిక్కెట్లు ఇవ్వటం లేదని చైల్డ్ రైట్స్ కమిషన్ దృష్టికి వచ్చినట్లు డీఈవో ఎస్.పురుషోత్తం తెలిపారు. విద్యాశాఖాధికారులు ప్రైవేట్ పాఠశాలలో చదివే 10వ తరగతి విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు అందేవిధంగా చూడాలన్నారు.

- 15న రాజధానిలో శ్రీనివాస కల్యాణం
- వెంకటపాలెం ఆలయం ఎదుట భారీ సెట్టింగ్స్



క్రేన్‌తో తరలిస్తున్న ఆలయ సెట్టింగ్ మెటీరియల్

- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు
- కల్యాణోత్సవానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు



స్వామి వారి కల్యాణ వేదికను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

వేంకటేశ్వరుని.. కల్యాణం చూతము రారండి

తుళ్లూరు,(వెంకటపాలెం) మార్చి 12(ఆంధ్రజ్యోతి) : రాజధాని గ్రామంలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం కల్యాణోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ నెల 15న శ్రీనివాసుని కల్యాణానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్ర 6.30 గంటల నుండి 8.30గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. దానికిగాను ఆలయం ముందు ఆవరణలో భారీ గుడి సెట్టింగ్స్ వేస్తున్నారు. ఈ ఉత్సవానికి సీఎం చంద్రబాబు హాజరవుతారని అధికారులు తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ అధికారులు, స్థానిక మండల అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు : ఈవో

శ్రీనివాస కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఈవో శ్యామలరావు సూచించారు. బుధవారం ఆయన వెంకటపాలెంలోని దేవాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు సులభతరంగా స్వామి వారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి వాహనాలను క్రమ పద్దతిలో పార్కింగ్ చేసేలా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సూచనలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి వారి కల్యాణాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ ఏర్పాట్లను పర్యవేశించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్‌కు ఆలయం తూర్పు భాగంలో సిద్ధం చేసిన స్థలం



భక్తులు కూర్చునేందుకు సిద్ధం చేసిన ప్రాంగణం



◆ గేదె, ఆవుకు రూ. 30 వేల వరకు బీమా
◆ తెల్లకార్డుదారులు 20 శాతం చెల్లిస్తే చాలు

పశువులకు బీమా...పాడిరైతుకు ధీమా

గుంటూరు సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది.పాడి పశువులతో బాటు, గొర్రెలు మేకలకు కూడా పశు బీమా పథకాన్ని అమలు పరిచేందుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ బీమా ద్వారా మూడు సంవత్సరాలకు ఒకేసారి ప్రీమియం చెల్లిస్తే రైతుకు ఏ నష్టం వాటిల్లినా పరిహారం అందే ఏర్పాటు చేశారు.నూతన బీమా పథకంలో గేదె,ఆవు విలువ రూ.30 వేలు ఉంటే, మూడు సంవత్సరములకు రూ. 1920 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు ప్రీమియం సొమ్ములో 20 శాతం అనగా రూ.384 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ. 1568ని ప్రభుత్వమే పశు యజమానుల తరపున చెల్లించటం జరుగుతుంది. తెల్లరేషన్ కార్డు లేని వాళ్ళు ప్రీమియం సొమ్ములో రూ.960 చెల్లించాలి. మిగిలిన రూ.960 సొమ్మును ప్రభుత్వం చెల్లించటం జరుగుతుంది. గొర్రెలు మేకలకు సంబంధించి గరిష్ఠంగా గొర్రె, మేకకు రూ.6 వేలకు ప్రీమియం మొత్తం రూ.180 చెల్లించాల్సి ఉంది. తెల్లరేషన్ కార్డు దారులు కేవలం రూ. 36 చెల్లిస్తే సరిపోతుంది. తెల్లకార్డు లేని వాళ్ళు రూ.90 చెల్లించాల్సి ఉంటుంది. పశు బీమా పథకం ద్వారా పశువు ప్రమాదము వలన గాని, వ్యాధుల వలన గాని, ప్రకృతి వైపరీత్యాల వలన గాని మరణించినచో ఈ బీమా వర్తిస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. మండలాలలో ఉన్న పశు వైద్యశాలలు, గ్రామీణ పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి పశుబీమా చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అగ్నివీర్‌లో నియామకాలకు 13 జిల్లాలకు నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేవోఐఎన్ఐఎన్‌డీఐఎన్ఏఆర్ఎంవై.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ కేటిగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరుగుతుందన్నారు. అలానే 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని 6 నిమిషాల 15 సెకన్లకు పెంచడం జరిగిందన్నారు. అన్ని కేటిగిరీలకు ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కల్ప, పొన్న, శేష వాహనాలపై నృసింహుడు

మంగళగిరి సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి నృసింహుడు బుధవారం వివిధ వాహనాలపై భక్తులను అలరించారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి ఊరేగిన శ్రీవారు.. రాత్రి పొన్న వాహనసేవలో పాల్గొన్నారు. ఓ వైపు పొన్న వాహన సేవ కొనసాగుతుండగానే శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీనృసింహస్వామి వార్ల ఉత్సవమూర్తులను కొత్త పెండ్లికుమార్తెలు, పెండ్లి కుమారుడిగా అలంకరింపజేసి శేష వాహనంపై గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆకురాతి కోదండరామయ్య అన్నమాచార్య కీర్తలను ఆలపించారు.



కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు

నేడు కల్యాణం... రేపు రథోత్సవం

● హాజరుకానున్న మంత్రి లోకేశ్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ గురువారం రాత్రి స్వామి వార్ల కల్యాణం జరుగనుంది. శుక్రవారం ఉదయం నృసింహ స్వామి వారు అశ్వ వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొంటారు. కల్యాణం అనంతరం శుక్ర వారం మధ్యాహ్నం దివ్య రథోత్సవం జరుగనుంది. అశేష జనవాహిని నడు మ జరిగే ఈ రథోత్సవాన్నే మంగళగిరి తిరునాళ్లగా వ్యవహరిస్తారు. 13వ తేదీ రాత్రి జరిగే కల్యాణ మహోత్సవానికి, 14న జరిగే స్వామివార్ల దివ్య రథోత్సవంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సతీసమేతంగా హాజరవుతారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు.

దివ్యాంగులకు ఇంధనం



- జిల్లాలో 2 వేల మందికి లబ్ధి
- దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు
- 50శాతం రాయితీ కల్పిస్తున్న ప్రభుత్వం

గుంటూరు (తూర్పు), మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు అందించింది. శారీరక వైకల్యం ఉండి స్వయం ఉపాధి పొందుతున్న వారికి, ప్రైవేటు ఉద్యోగులకు రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించనుంది. దీనికి సంబంధించిన గుంటూరు బృందావన్‌గార్డెన్స్, వయో వృద్ధులు, హిజ్రాల, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధన భారం లేకుండా 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రాయితీపై ఇంధనం అందించే పథకాన్ని రూపొందించి అమలు చేసింది. అ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూ ర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధులను పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపించాయి. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ పథకాన్ని పట్టాలెక్కించింది.

● **అర్హులు ఎవరంటే....**

స్వయం ఉపాధి పొందుతున్న వారు. ప్రైవేటు ఉద్యోగులు చేసుకుంటూ మూడు చక్రాల మోటారు కల్గిన వాహనాలు వినియోగించే దివ్యాంగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వాహనానికి వినియోగించే డీజిల్, పెట్రోల్ ఖర్చులో 50శాతం రాయితీ ఇస్తారు. లబ్ధిదారులు ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్లే దూరానికి మాత్రమే ఈ రాయితీ వర్తింపజేస్తారు. 2 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15లీటర్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కల్గిన వాహనాలకు 25 లీటర్లు వరకు రాయితీ ఉంటుంది. ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులకు వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారులక ఖాతాలకు జమ చేస్తారు.

● **కావాల్సిన పత్రాలు**

దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం (తొలి పేజీ), ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ఏదైన సంస్థలో పనిచేస్తున్నట్టు ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

● **జిల్లాలో రెండు వేల మందికి పైగా లబ్ధి**

ఇంధన రాయితీ పథకంతో జిల్లాలో రెండు వేల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుంది. గతంలో ప్రభుత్వం అందించిన వెయ్యి మూడు చక్రాల వాహనాలతో పాటు, మరి కొంత మం ది రుణాల ద్వారా మరో వెయ్యి వాహనాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంతో ప్రతి లబ్ధిదారునికి ఏడాదికి దాదాపు రూ 25వేలు వరకు లబ్ధి చేకూరుతుంది.

● **సద్వినియోగం చేసుకోవాలి**



ప్రభుత్వం అందజేస్తున్న ఇంధన రాయితీని దివ్యాంగులు సద్వియోగం చేసుకోవాలి. పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకానికి దివ్యాంగులు ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తరువాత ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులను కార్యాలయంలో సమర్పించాలి. ఆ తరువాత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం.

-సువార్త, ఏడీ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ

● **ఆర్థిక భారం తగ్గుతుంది**



ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంతో దివ్యాం గులకు ఆర్థిక భారం కొంత మేర తగ్గుతుంది. స్వ యం ఉపాధిని కొనసా గించడానికి, వారికి జీవన నాణ్యతను మెరు గుపరిచేందుకు శక్తి నిస్తుంది. ప్రభుత్వం స్పందించి అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పునరుద్ధరించడం అభినం దనీయం. దీంతో పాటు గతంలో మూడు చక్రాల వాహనాలు ఇవ్వాలంటూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించాలి.

వెలుగు శివప్రసాదు, విభిన్న ప్రతిభా వంతుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు

వసూలు.. 37.06 శాతమే

(5వ పేజీ తరువాయి)

కార్యాలయాలకు సంబంధించి 7.10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి రూపాయి కూడా వసూలు కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.35.64 కోట్లు ఉంది.

- బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు లక్ష్యం కాగా రూ.20.29 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 6.63 కోట్లకు రూ.1.94 కోట్లు వసూలైంది. బాపట్ల మినహా మిగిలిన మున్సిపాల్టీలు 53 శాతానికి పైగా వసూలు చేశాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయి రూ.3.55 కోట్లు ఉంది. 71.80 శాతం పన్ను వసూలుతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో అద్దంకి మున్సిపాల్టీ నిలిచింది.

మామూళ్ల.. కిక్

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. బాపట్ల జిల్లాలో అధికారికంగా 119 మద్యం షాపులు ఉండగా అనధికారికంగా 700 వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులతో పాటు మద్యం షాపుల యజమానులకు నెల వారీ మామూళ్లను ఎక్సైజ్‌శాఖ ఫిక్స్ చేసినట్లు సమాచారం. నెలకు దాదాపు రూ.30 లక్షల వరకు ముడుపుల రూపంలో ఎక్సైజ్‌శాఖకు ముడుతున్నట్లు మద్యం షాపుల యజమానులే చెబుతున్నారు. బాపట్ల జిల్లాలో ఓ నియోజకవర్గ పరిధిలో ఓ నేత ఏకంగా అయా గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపే వారి జాబితాను ఎక్సైజ్‌శాఖకు పంపి ఆ షాపుల వైపు కన్నెత్తి చూడొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇక ద్వితీయశ్రేణి నేతాగణం కూడా ఈ దందాలో అన్నీ తామై వ్యవహరిస్తున్నారని సమాచారం.

యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన

అధికారులు అడిగినంత మామూళ్లు ఇస్తున్నాం కదా అని మద్యం దుకాణదారులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి మున్సిపల్ కేంద్రాలు, పల్లెల్లో అక్కడా ఇక్కడ అన్న తేడా లేకుండా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కొన్ని దగ్గర్ల ఆరుబయటే, ప్రధాన రహదారులపైనే మందుబాబులు మద్యం తాగుతూ అల్లర్లు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. మందుబాబులు ఆగడాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు ఆలకించడంలేదు. గ్రామాల్లో వీధివీధినా బెల్టు షాపులు నిర్వహించుకుంటున్నా పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక పలు ప్రాంతాల్లో మద్యం షాపులు వేళలు కూడా పాటించడం లేదు ఎనీ టైం అన్న తరహాలో కొన్నిచోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం షాపులకు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వకపోయినా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. దీంతో రెస్టారెంట్ తరహాలో మద్యం షాపులు నడుస్తున్నాయి. సమయాన్ని బట్టి ఎమ్మార్పీకి అదనంగా వసూలు చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. నెలవారీ మామూళ్ల ఫిక్స్ చేసి వసూళ్ల చేసుకునే పనిలో ఎక్సైజ్ శాఖ బిజీగా ఉంటే, అధికార పార్టీ నేతల అండతో ద్వితీయశ్రేణి నాయకులు బెల్ట్ షాపుల నిర్వహించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా దుకాణాల్లో ఎమ్మార్పీ ధరకంటే అదనంగా రూ.30 నుంచి 40 వరకు వసూలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూస్తున్న పాపాన పోవడం లేదు.

ప్రపంచ భవిష్యత్తు భూమి, మొక్కల చేతుల్లోనే..


గుంటూరు సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ భవిష్యత్తు ఆరోగ్య కరమైన భూమి, మొక్కల చేతుల్లోనే ఉందని అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి అన్నారు. లాంఫామ్ లోని ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఆయన ముఖాముఖిగా చర్చించారు. ప్రొఫెసర్ ఎం ఎస్ రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ విధానాలు, పరిశోధనలపై వివరించారు. ఈ కార్యాలయంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారదా జయలక్ష్మి, పరిశోధనా సంచాలకులు డాక్టర్ వీవీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఎం ఎస్ రెడ్డి

మందడంలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

తుళ్లూరు, (మందడం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. మందడం టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని పలకరించింది. యూనిట్ ఆఫీసును సందర్శించింది. బృంద సభ్యులు రైతులతో ముచ్చటించారు. రాజధాని గ్రామాల్లో ప్రజల ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, భూములిచ్చిన రైతుల స్థితిగతులు, గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు తదితర అంశాలను తెలుసుకోవడానికి ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించినట్టు సీఆర్డీఏ అధికారులు చెప్పారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బృంద సభ్యుల కు పేదల టిడ్కో ఇంటి నివాసాలు.. వర్షపు నీరు నిర్వహణ, వాగుల అభివృద్ధి, ప్లాట్ల రిజిస్ట్రేషన్, అమరావతిలో జరిగిన అభివృద్ధి, జరగబోతున్న అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణాలు, రైతుల ప్లాట్లలో అభివృద్ధి గురించి మందడం యూనిట్ కార్యాలయంలో ఎల్ఈడీ స్ర్కీన్‌పై వివరించారు.



మందడం సీఆర్డీఏ కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు బృందం



45 కిలోల పులిహోరతో వేంకటేశ్వరుని ప్రతిమ

ఘనంగా వీరరాఘవస్వామి బ్రహ్మోత్సవాలు

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వేదవల్లి, కనకవల్లి తాయార్ల సమేత శ్రీ వీరరాఘవస్వామి దేవస్థానంలో బుధవారం ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో మూల విరాట్‌కు ఎదురుగా 45 కిలోల పులిహోరతో వేంకటేశ్వరుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై పూజలు నిర్వహించారు. పులిహోర ప్రతిమను చూసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

నల్లమడ రైతు సంఘం నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు రాజమోహన్‌రావు, రైతులు

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైట్‌బర్లీ పొగాకు సాగుచేసుకున్న రైతులను ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో మద్దతు ధరను కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఏడాది పొగాకు పంట ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు వేల ఎకరాల్లో అధిక పెట్టుబడులు వెచ్చించి వైట్‌బర్లీ పొగాకును వేశారన్నారు. కూలీల కొతరతో సగం పంట పొలాల్లోని నష్టపోవాల్సి వచ్చిందన్నారు. చేతికి వచ్చిన అరకొర పంటకు సరైన ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి బర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి చేర్చి మద్దతు ధరను ప్రకటించాలని కోరారు. అలాగే మిర్చి రైతులకు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పి.బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్ కుమార్, చుండూరి రంగారావు, కోటా హరిప్రసాద్, ఒగ్గిశెట్టి నరసింహం, కాకానీ వీరయ్య చౌదరి, వెంకటేశ్వర్లు, షేక్ మహ్మద్‌బాషా, మస్తానరావు, జాలాది సుధీర్, మల్లా శ్రీనివాసరావు, నరసింహులు, నరిశెట్టి బాబు, సాంబయ్య, ఆదియ్య పాల్గొన్నారు.

త్వరలో పరిపాలనలో మార్పులు

జనసేన పార్టీ నేత స్వాములు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వాములు, ఇతర నాయకులు

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జనసేన పార్టీకి సంబంధించి నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమాలు, పరిపాలనలో మార్పులు ఉంటాయని జనసేన పార్టీ నేత ఆమంచి స్వాములు అన్నారు. బుధవారం రోటరీ సమావేశం హాలులో చలో పిఠాపురం పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా టీడీపీ కూటమితో స్నేహభావంతో సాగుతామన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ప్రజల కోసం శ్రమిస్తున్నట్లు చెప్పారు. పిఠాపురంలో 14న జరిగే పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తనతో పాటు ఆవిర్భావ సభకు నియోజకవర్గ సమన్వయకర్తలుగా గూడూరు శివరామప్రసాద్, లక్కాకుల లక్ష్మిని అధిష్టానం నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, మామిడాల శ్రీనివాసరావు, పి శ్రీనివాసరావు, నాగలక్ష్మీ, కోటేశ్వరి, భాగ్యలక్ష్మీ తదితర నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యత మెరుగునకు బోధన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వేటపాలెం(చీరాల), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యత మెరుగుపడేలా బోధన చేయాలని ఎంఈవో పురుషోత్తం అన్నారు. బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో కాంప్లెక్సు స్థాయి క్లస్టర్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా డి గ్రేడ్లు దశలో ఉన్నవారిని ఏ గ్రేడ్లు అందుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంవో శ్రీనివాసరెడ్డి, శేఖరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు : కష్టపడి ఇష్టంతో చదివి మంచి మార్కులను సాధించాలని ఎంపీడీవో స్వరూపారాణి విద్యార్థులను కోరారు. బుధవారం స్థానిక హైస్కూల్లో 10 వతరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు సీకేఎస్ ఆశ్రమం వారు పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఎంపీడీవో మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ షడక్ బాబు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

బల్లికురవ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతమాగులూరు రోడ్డు సోమవరప్పాడు గ్రామ రోడ్డు ఎదురుగా గుర్తు తెలియని కారు మోటార్ బైకిస్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న తంగిరాల చిన్నకు తీవ్ర గాయాలు అయ్యాయి. సోమవరప్పాడు నుంచి బైకుపై బల్లికురవ వస్తుండగా సంతమాగులూరు రోడ్డు నుంచి వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయాలైన చిన్నను వెంటనే వారి బంధువులు నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు.

పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం

- ఆ దిశగా సీఎం చంద్రబాబు అడుగులు
- ఎమ్మెల్యే ఏలూరి
- 12 ఎస్సీకుటుంబాలకు సబ్సిడీతో 14 లక్షల రుణాల పంపిణీ
- 37 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మార్టూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఏళ్ల తరబడి పేదరికంతో బాధపడుతున్న కుటుంబాలను ఆదుకోవాలని, వారు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘంలోని ఎస్సీ కుటుంబాలకు చెందిన 12 మంది మహిళలకు, ఒక్కొక్కరికి రూ.50వేల సబ్సిడీతో, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.14లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 37 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.26 లక్షల 84వేల594 చెక్కులను బాధితులకు స్వయంగా ఏలూరి అందచేశారు. ఇప్పటికి నియోజకవర్గంలో బాధితులకు రూ.3కోట్ల 26 లక్షలు సీఎం సహాయనిధి నుంచి చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రూ.14లక్షల రుణాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటుచేయాలి

నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాలయాలు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా పిల్లలకు విద్యను అందించాలని నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఎంఈవోలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. ఆయన బుధవారం సాయంత్రం అన్ని మండలాలోని ఎంఈవో, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖకు చెందిన అధికారులతో ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మొదటి ఎంపిక ప్రభుత్వ పాఠశాల ఉండాలన్న లక్ష్యంతో మంత్రి లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. 1 వతరగతి నుంచి 5 వతరగతి వరకు ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసే విధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. అదేవిధంగా వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే విధంగా వారికి సహకారం అందించాలని, ఆధునిక యంత్ర పరికరాలను సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు అందిస్తుందని తెలిపారు.

నేరుగా పొలాలు దగ్గరకు వెళ్లాలని, వారు వేసిన పంటలను పరిశీలించాలని, వ్యవసాయం సాగులో వారికి సూచనలు, సలహాలను అందించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవలో ఏలూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళలకు ఆర్థికంగా భద్రతను కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, వారికి టైలరింగ్‌లో శిక్షణ నిచ్చే కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత వారికి ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు శాఖలకు చెందిన అధికారులతోపాటు, స్థానిక నాయకులు నాయుడు హనుమంతరావు, కనపర్తి నాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు, గుదే తారకరామారావు, నల్లపనేని రంగయ్య చౌదరి, పొదవీరయ్య, కంభంపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర లేక వైట్‌బర్లీ రైతుల దిగాలు

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భారీ పెట్టుబడులు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక వైట్ బర్లీ రైతులు దిగాలు చెందుతున్నారు. మరో పక్క చేతికి అందివచ్చిన పంటను అమ్ముకుందామన్నా అరకొర ధరను చూచి రైతులు ఆందోళన చెందుతున్నారు. వైట్ బర్లీ సాగుకు రాష్ట్రంలోనే పర్చూరు ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ సాగు చేయడంతోపాటు పరిసర జిల్లాలకు వెళ్లి భూములను కౌలుకు తీసుకొని మరీ సాగు చేస్తూంటారు. బాపట్ల జిల్లా పరిధిలో 60వేల ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును రైతులు సాగుచేస్తే అందులో అధిక భాగం పర్చూరు నియోజకవర్గం కావడం విశేషం. ఎకరానికి రూ.40వేల వరకు కౌలు చెల్లించి వైట్‌బర్లీ పొగాకును రైతులు సాగు చేస్తున్నారు. వీరిలో అత్యధికులు కౌలుదారులే. వాతావరణ పరిస్థితులు అనుకూలించి దిగుబులు ఆశాజనకంగా ఉన్నా వైట్ బర్లీ సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. పంట చేతికి అందివచ్చిన తరుణంలో కూలీల కొరతతో కొంత పంట చేతిలోనే ఎండిపోయింది. దీంతో అధిక శాతం రైతులు అరకొర దిగుబడులకే పరిమితం అయ్యారు. గతేడాది దిగుబడితోపాటు ధర ఆశాజనకంగా ఉండడంతో అధిక విస్తీర్ణంలో వేల ఎకరాల్లో రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగు చేసుకున్నారు. గత ఏడాది తక్కువ రకం (లోగ్రేడ్) పొగాకు క్వింటా రూ.14వేల పైచికులు అమ్మకాలు సాగాయి. నాణ్యమైన పొగాకు గరిష్టంగా క్వింటా రూ.19వేలు పలికింది. ప్రస్తుతం పంట చేతికి వచ్చిన తరుణంలో లోగ్రేడ్ ధర రూ.4వేలకు మించి లేకపోవడం, నాణ్యమైన పొగాకు క్వింటా రూ.9వేలకు మించి లేకపోవడంతో అన్నదాతల గుండెల్లో గుబులు రేకెత్తిస్తుంది. దీంతో వ్యవసాయ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరానికి రూ.150 మేర ఖర్చు అయినట్లు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధర దిగుబడులను చూస్తుంటే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోకపోతే అప్పుల ఊబిలో చిక్కుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పుటూరులో ధర లేక మండెలుగా ఉంచిన వైట్‌బర్లీ పొగాకు

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఏమిచేయాలో పాలుపోవడం లేదు. ఎకరం రూ.30వేలు చెల్లించి నాలుగు ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును సాగు చేశాను. గత ఏడాది లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.14వేలు ఉంటే, ప్రస్తుతం రూ.4వేలకు దిగజారింది. నాణ్యమైన పొగాకును ధరకూడా అంతంత మాత్రంగానే ఉంది.

\- కే నాగేశ్వరరావు, తిమ్మరాజుపాలెం

గణనీయంగా పెరిగిన పెట్టుబడులు



గతంలో ఉన్నడూలేని విధంగా ఈసారి కూలీల కొరత తీవ్రంగా వేధించింది. పంట చేతికి అందివచ్చిన తరుణంలో కూలీలు దొరక్క సగం పంట చేలోనే ఎండిపోయింది. దీంతో దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం ఉన్న ధరను చూస్తుంటే ఎకరానికి లక్షలకు పైగా నష్టపోవాల్సి వస్తుంది.

\- బైరుశెట్టి మల్లికార్జునరావు, పర్చూరు



మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

మద్దతు ధరకే శనగల కొనుగోలు

అద్దంకిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : శనగలను ప్రభుత్వం పకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ శనగలుకు మద్దతు ధర రూ.5,650గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో అంతకన్నా తక్కువ ఉంటే ప్రభుత్వం మద్దతు ధర కల్పింస్తుందన్నారు. రబీలో సాగు చేసిన మొక్కజొన్నకు రూ.2225, కందులుకు రూ.7550 క్వింటా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గోనె సంచులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని తెలిపారు. పీఎం కిసాన్ పొందుతున్న రైతులు ఇంకా 3 వేల మంది విశిష్ట సంఖ్య కోసం రిజిస్టేషన్ చేయించుకోవాలని, వీరందరూ గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

కనిగిరిలో తగ్గని కాపీయింగ్ జోరు

- ఇన్విజిలేటర్లు రిలీవ్
- ఒకే రోజు 8 మంది డీబార్
- ఆ సెంటర్ల అధికారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు విద్య, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కాపీయింగ్ జోరు తగ్గలేదు. బుధవారం ఒకే రోజు మూడు పరీక్షా కేంద్రాల్లో ఎనిమిది మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారంటే అక్కడ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. 'జోరుగా కాపీయింగ్' శీర్షికన కనిగిరిలో ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో జరుగుతున్న వ్యవహారంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ రాష్ట్ర కార్యాలయం నుంచి కోఆర్డినేటర్ అక్బర్ ఆలీఖాన్ బుధవారం కనిగిరిలోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనిగిరిలోని ఏపీ మోడల్ స్కూలు పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని, సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు కేంద్రంలో ఇద్దరిని, కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకరిని పట్టుకుని రాష్ట్ర కోఆర్డినేటర్ అక్బర్ ఆలీఖాన్ డీబార్ చేశారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డ పరీక్ష హాలులో ఇన్విజిలేటర్లుగా పనిచేస్తున్న టీచర్లందరిని పరీక్షల విధుల నుంచి సస్పెండ్ చేశారు.

అధికారులకు సంజాయిషీ నోటీసులు

కనిగిరిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఎనిమిది మంది విద్యార్థులు డీబార్ కావడం జిల్లాలో సంచలనం సృష్టించింది. రాష్ట్ర అధికారి పట్టుకోవడం, ఇక్కడి అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం, పరీక్షల నిర్వహణలో డొల్లతనాన్ని ఎత్తిచూపింది. ఈ మూడు పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, పర్యవేక్షక అధికారందరికి సంజాయిషీ నోటీసులు జారీ చేస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. కనిగిరిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో మూడింటిలో విద్యార్థులు డీబార్ అయ్యారు. గణితం, హిస్టరీ పరీక్షకు 663 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణితంలో 1,927 మందికి 1,319 మంది, హిస్టరీలో 235 మందికి 180 మంది, అకౌంటెన్సీ పరీక్షకు ఒక్కరు హాజరయ్యారని కిరణ్‌కుమార్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 21, ఒంగోలు, మార్కాపురం ఉప విద్యాధికారులు ఐదేసి కేంద్రాలను సందర్శించారు.

చెవిరెడ్డీ అవాస్తవాలు మానుకో

- ఎన్నికల కమిషన్ ఫిర్యాదు మేరకే కేసు
- వైపాలెం టీడీపీ నేత ఎరిక్షన్‌బాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్నికల అధికారిపై దౌర్జన్యం నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన పిర్యాదు మేరకే వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.. ఈ విషయంలో అతను చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో పుల్లలచెరువు మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుండగా చెవిరెడ్డి వచ్చి హడావుడి చేశారని తెలిపారు. ఆయన దౌర్జన్యానికి పాల్పడినందునే పోలీసులు కూడా గాలిలో కాల్పులు జరపాల్సి వచ్చిందన్నారు.

రెండు హాస్టల్ భవనాలకు రూ.12 కోట్లు

- ఒంగోలు, ఎర్రగొండపాలెంలకు మంజూరు
- మంత్రి చొరవతో జిల్లాకు వచ్చాయి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కాలేజీ బాలికల వసతిగృహాల నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరయ్యాయి. ఒంగోలు, ఎర్రగొండపాలెంలలో ఒకొక్క చోట రూ.6కోట్లు వ్యయం చేసి వీటికి సొంత భవనాలు నిర్మిస్తారు. ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చొరవతో జిల్లాకు రెండు హాస్టళ్ల దక్కటం విశేషం. రాష్ట్రం మొత్తం 25 వసతిగృహ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా అందులో రెండు జిల్లాకు వచ్చాయి. ఒంగోలులో పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో ఈ హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. ఎర్రగొండపాలెంలో బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి దశాబ్దకాలం నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ నియోజకవర్గ టీడీపీ నాయకుడు ఎరిక్షన్‌బాబు మంత్రికి ప్రత్యేక విజ్ఞప్తి చేయటంతో ఆయన ఇక్కడ హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి స్వామిని కలిసి ఎరిక్షన్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

సీసీ కెమెరాలు ఏర్పాటు

ఒంగోలు విద్య, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్షా కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లాలో 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిల్లో ఆరు సునిత్నమైన, సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పరీక్షల నిర్వహణలో గతంలో కాపీయింగ్, శాంతిభద్రతలు, బయటి వ్యక్తుల జోక్యం తదితర అంశాల ప్రాతిపదికన ఈ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. బేస్తవారపేట మండలం పిటికాయగుళ్ల, పెద్దారవీడు మండలం వైడిపాడు, అర్ధవీడు మండలం మాచవరం, రాచర్ల, సీఎస్ పురం జడ్పీ హైస్కూళ్లు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇంటర్ పరీక్షల తరహాలో ఈ కేంద్రాలకు సీసీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిఘా నేత్రాలను ఒంగోలులోని డీఈవో కార్యాలయం, విజయవాడలోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఈ రెండు కార్యాలయాల నుంచి అధికారులు పరీక్ష జరుగుతున్న తీరును నేరుగా సమీక్షించవచ్చు. అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, అధికారుల బృందాలు ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు.



గోపాలపురంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నామ్ హైవే అధికారులు

గోపాలపురంలో ఆర్వో ప్లాంట్

ప్రారంభించిన హైవే అధికారులు

అద్దంకి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో భాగంగా నామ్ హైవే నిర్వహణ సంస్థ క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో మండలంలోని గోపాలపురంలో బుధవారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యూబ్ హైవేస్ సీఎస్ఆర్ హెడ్ అశోక్ శర్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించడం జరుగుతుందన్నారు. గోపాలపురం ప్రజలకు రక్షిత మంచి నీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎఫ్‌సీ సోషల్ స్పెషలిస్ట్ భారతి, నామ్ హైవే ప్రాజెక్ట్ హెడ్ శ్రీకాంత్‌బాబు, పీల్డ్ ఎగ్జిక్యూటివ్ గెల్లా వీరాంజనేయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

సీసీ కెమెరాలు ఏర్పాటు

ఒంగోలు విద్య, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్షా కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లాలో 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిల్లో ఆరు సుని త్నమైన, సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పరీక్షల నిర్వహణలో గతంలో కాపీయింగ్, శాంతిభద్రతలు, బయటి వ్యక్తుల జోక్యం తదితర అంశాల ప్రాతి పదికన ఈ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. బేస్తవారపేట మండలం పిటికాయగుళ్ల, పెద్దారవీడు మండలం వైడిపాడు, అర్ధవీడు మండలం మాచవరం, రాచర్ల, సీఎస్‌పురం హైస్కూళ్లు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇంటర్ పరీక్షల తరహాలో ఈ కేంద్రాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిఘా నేత్రాలను ఒంగోలులోని డీఈవో కార్యాలయం, విజయవాడలోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఈ రెండు కార్యాలయాల నుంచి అధికారులు పరీక్ష జరుగుతున్న తీరును నేరుగా సమీక్షించవచ్చు.

15న గిద్దలూరులో జాబ్‌మేళా

గిద్దలూరు టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాక్ సంయుక్తంగా ఈ నెల 15వ తేదీ ఉదయం 10గంటలకు తమ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సాయిచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రంగస్వామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఆపైన చదివిన నిరుద్యోగ యువతీయువకులకు మిషన్ ఆపరేటర్స్, ఫార్మసిస్టు, ఫార్మసీ ట్రైనీ, జూనియర్ ఆఫీసర్, జూనియర్ కెమిస్ట్ తదితర ఉద్యోగాలు భర్తీ చేసేందుకు వీలుగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అడుగడుగునా ఆక్రమణలే!

» యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలపై కన్ను ఆపై కబ్జా
» పలు వార్డుల్లో చోటుచేసుకుంటున్న వైనం
» చోద్యంచూస్తున్న అధికారులు



31వ వార్డులోని ప్రభుత్వ స్థలంలో ట్రాక్టర్‌లతో మట్టినింపుతున్న వైనం

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆక్రమణలతో వీధి రోడ్లు, కాలువలు వంటివి కబ్జాకు గురయ్యాయి. కొందరు పలుకుబడిని ఉపయోగించుకుని, తాజాగా మరి కొందరు రోడ్డు మార్జిన్‌లు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు.

దండుబాట రోడ్డు, వైకుంఠపురం, శాంతినగర్, థామస్‌పేట తదితర వార్డుల్లో ఇప్పటికే ఆక్రమణలు జరగ్గా, తాజాగా 31వ వార్డు రోశయ్య కాలనీలో ఆక్రమణలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మట్టితో పూడ్చుకుని ఎంచక్కా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. కొందరు ఇష్టారీతిగా ట్రాక్టర్‌లతో మట్టి, డస్ట్‌తో పూడ్చుకుని శాశ్వత నిర్మాణాలు చేసుకుని ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా.. సినిమాల్లో పోలీసుల్లా విషయంపై ఆరా తీసి చర్యలు తీసుకుంటామని తాపీగా చెప్పారు. అయితే అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు మాత్రం జోరుగా వారి పని వారు కానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేయకుంటే వార్డుల్లో ప్రభుత్వ స్థలాలు కనుమరుగు కావల్సిందే.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

» వైసీపీ పాలనలో బిల్లులు చెల్లించక నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్‌లు
» కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజల విజ్ఞప్తి




దైవాలరావూరులో అసంపూర్తిగా సచివాలయ భవనం

మేదరమెట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సచివాలయ వ్యవవస్థను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్కటి రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో లేక కట్టడాలు ప్రాంభించలేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు ప్రాంభించి పూర్తి చేశారు. సచివాలయ కార్యకలాపాలు ఆ భవనాల్లోనే సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పునాదుల దశలో కొన్ని, 50, 60శాతం పనులు జరిగి అసంపూర్తిగా ఉన్నాయి. సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు కొంతమందికి వైసీపీ బిల్లులు కూడా చెల్లించలేదు. గ్రామాల్లో సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయి. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి.

కొరిశపాడు మండలంలో మొత్తం 15 సచివాలయాలలో రెండు సచివాలయాల భవనాల నిర్మాణానికి నిధులు మం జూరు కాలేదు. మొత్తం 13 సచివాలయాల్లో 3 సచివాలయ భవానాలు నిర్మాణం పూర్తి చేసుకొని కార్యాలయాలు నడుస్తున్నాయి. 50 శాతం పూర్తయిన సచివాలయాల్లో పమిడిపాడు-1, 2 దైవాలరావూరు, తమ్మవరం సచివాలయాలు ఉన్నాయి. రాచపూడి, మేదరమెట్ల-2, పి గుడిపాడు, కుర్రవానిపాలెం సచివాలయాలకు ఒక్కొక్క భవనానికి సుమారు రూ.5 లక్షలు నిధులు అందిస్తే పూర్తి అవుతాయి. వినియోగంలోకి కూడా వస్తాయి. తిమ్మనపాలెం సచివాలయం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఊరికి దూరంగా ఉందని గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. రాచపూడిలో పాఠశాల ఆవరణలో సచివాలయం నిర్మించారని కోర్టులో కేసు వేశారు. పమిడిపాడు-1, 2 సచివాలయ భవన నిర్మాణ విషయంలో కోర్టుకు వెళ్లారు.

ఆరోగ్య కేంద్రాలు మండలంలో 9 మంజూరయ్యాయి. అందులో 3 అసలు పనులు ప్రారంభం కాలేదు. మూడు అసంపూర్తిగా ఉన్నాయి. 3 భవనాలు నిర్మాణం పూర్తి చేసుకొని కార్యాలయాలు పని చేస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలు 11 మంజూరయ్యాయి. అందులో 6 భవనాలు నిర్మాణం పూర్తయ్యాయి. 5 అసంపూర్తిగా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలకు నిధులను మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. రూ.5 లక్షలలోపు నిధులతో పూర్తయ్యే భవనాలను వెంటనే పూర్తి చేయించాలని ఆయా స్థానికులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, అధ్యాపకులు

ఉద్యోగాలకు శ్రీ హర్షిణి విద్యార్థుల ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : క్యాంపస్ ఎంపికలో అద్దంకిలోని శ్రీ హర్షిణి డిగ్రీ కాలేజీలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పోపూరి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కంపెనీ నుంచి వచ్చిన ఆఫర్ లెటర్‌ను విద్యార్థులకు అందించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పోపూరి నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ఒంగోలులోని శ్రీ హర్షిణి కాలేజీ మెయిన్ బ్రాంచిలో జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో అద్దంకి బ్రాంచికు చెందిన 6 గురు విద్యార్థులకు ఇంటర్వ్యూలో పాల్గొని చెన్నైకు చెందిన కంపెనీలో ఉద్యోగాలు పొందారు. దానికి సంబంధించి ఆ కంపెనీ సీఈవో నుంచి ఆఫర్ లెటర్ వచ్చినట్లు తెలిపారు. ఆ ఆఫర్ లెటర్‌ను ఎంపికైన విద్యార్థులకు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న కమిటీ సభ్యులు

ఇంకొల్లు,మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కన్యకాపరమేశ్వరి ఆర్య వైశ్య కల్యాణ మందిరంలో ఇంకొల్లు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని ఉదయం 10.49 గంటకు ప్రతిష్ఠించారు. ఉదయం గోపూజ, మహాగణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్యపూజ, వాస్తుపూజ, హోమం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి పంచలోహ విగ్రహానికి కమిటీ అధ్యక్షుడు బెల్లంకొండ వాసు దేవరావు,కొత్త శ్రీనివాసరావు దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



కేక్‌ను కటింగ్ చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం వైసీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబుతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించి అందరికి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటుపడటంతో పాటు, ప్రజల పక్షాన నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేరిబాబు, వాసు, గవిని శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచండి

అద్దంకిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు తరగతుల్లో సీ, డీ గ్రేడ్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలని చీరాల డివిజన్ డిప్యూటీ ఈవో డి.గంగాధరరావు సూచించారు. బుధవారం శంఖవరప్పాడు జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ప్రతి పాఠశాలలో నెలకోసారి ఉపాధ్యాయ సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతిని, ఉపాధ్యాయుల సన్నద్ధత వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ చంద్రశేఖర్, ధర్మవరం, బొమ్మనంపాడు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదరణ-3తో ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

చీరాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు ఆదరణ-3 ద్వారా అందించే పనిముట్లు సాయంతో ఉపాధిఅవకాశాలు మెరుగు పరచుకోవాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో అధికారులు వివిధ కుల వృత్తుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆదరణ2 ద్వారా 335 రకాల పరికరాలను అందజేసినట్లు చెప్పారు. వాటి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, కుల వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వం ఆదరణ-3 ద్వారా గ్రామాల్లో అర్హత ఉన్న బీసీ కుల వృత్తిదారులకు స్వయం ఉపాధికి పరికరాలను అందజేస్తుందని ఎంపీడీవో కె.కుసుమకుమారి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కుల వృత్తి దారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వం అందించే పరికరాల నాణ్యతపై చర్చించారు. వారు తెలిపిన వివరాలను ఉన్నత అధికారులకు తెలియజేస్తామని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి, సీనియర్ సహాయకులు సీహెచ్‌వై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

షైలవరం ఉపాధ్యాయుల వినతి

అద్దంకిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్షల సమయంలో విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని షైలవరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదివ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలోని చివరి గ్రామం అయిన షైలవరం జడ్పీహెచ్‌ఎస్ నుంచి 45 మంది పదివ తరగతి విద్యార్థులు పరీక్ష రాసేందుకు బల్లికురవ మండలం వైదన జడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రానికి ఉదయం 9గంటలకే వెళ్లి పరీక్ష రాయాల్సి ఉందన్నారు. అందరూ పేద విద్యార్థులైనందున ఈ పాఠశాల నుంచి పరీక్ష సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



వరిగడ్డి వామి దగ్ధం

మార్టూరు,మార్చి12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నతాళి గ్రామంలో ఎస్సీ కాలనీలో బుధవారం సాయంత్రం పెద్దబ్బాయికి చెందిన వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన జరిగింది. చిలకలూరిపేట నుంచి వచ్చిన ఫైరింజన్ మంటలను పూర్తిగా ఆర్పివేసింది.ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బల్లికురవ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన గాలం ప్రభాకరరావు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గాలం వెంకటేశ్వర్లు ట్రస్టు పేరున ఏటా విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్‌లు, ఇతర వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు రూ.6వేల నగదు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని అయన తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

